## ముగ్గురు ఎమ్మెల్సీల రాజీనామా

- మండలి చైర్మన్ గుత్తా ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తమ ఎమ్మెల్సీ పదవులకు శనివారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి సమర్పించారు. ఈ మేరకు వీరి రాజీనామాలను మండలి చైర్మన్ ఆమోదించారు. ఎమ్మెల్సీ పదవులు ఉన్న కారణంగా కడియం, పల్లా, కౌశిక్‌రెడ్డి శాసనసభ తొలిరోజు సమావేశాల్లో ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేయకపోవడం గమనార్హం.

## ఏడుగురు ప్రభుత్వ సలహాదారుల తొలగింపు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ సలహాదారులుగా కొనసాగుతున్న ఏడుగురిని తొలగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారులు అనురాగ్ శర్మ, ఏకే ఖాన్, జీఆర్‌రెడ్డి, ఆర్ శోభ, చెన్నమనేని రమేశ్‌బాబు, సీఎం ముఖ్య సలహాదారు సోమేశ్‌కుమార్‌ను తొలగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

## క్యాబినెట్‌లో కులగణనపై తీర్మానం చేయాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన అంశంపై తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్ తీర్మానం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. ఈ విషయమై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి కులవృత్తులకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బీహార్ రాష్ట్రం మాదిరి కులగణనను వెంటనే ప్రారంభించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల అవకాశాలను 42 శాతానికి పెంచుతామన్న హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించి బీసీ నాయకత్వ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# బీఆర్ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు
- సభాపక్షం ఎంపిక బాధ్యత అధినేత కే చంద్రశేఖర్‌రావుకు అప్పగింత
- అసెంబ్లీకి ప్రత్యేక బస్సులో ఎమ్మెల్యేలు
- తెలంగాణ అమరవీరులకు నివాళులు
- అనంతరం అసెంబ్లీలో ప్రమాణం
- హాజరు కాలేకపోయిన కేసీఆర్, కేటీఆర్, ఇతర నేతలు



శనివారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, జై తెలంగాణ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎన్నికయ్యారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ ఎల్పీనేతగా కేసీఆర్ పేరును మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించగా.. మాజీ మంత్రులు కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్ యాదవ్ బలపరిచారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి సహా పార్టీ ఎమ్మెల్యేలు హర్షధ్వానాలు వ్యక్తంచేశారు. శాసనసభాపక్షం మిగతా కమిటీని ఎంపిక చేసే బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.


### హాజరు కాలేకపోయిన కేసీఆర్, కేటీఆర్

తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో కేసీఆర్ శాసనసభాపక్షం భేటీకి రాలేకపోయారు. ఆయనకు పరిచర్యలు చేస్తూ దవాఖానలోనే ఉండిపోయిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఎల్పీ సమావేశానికి హాజరు కాలేకపోయారు. ఈ విషయాన్ని ఆయన పార్టీ ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి సమావేశం నిర్వహించాలని కోరారు. శాసనసభ తొలి రోజు సమావేశాలకు కూడా హాజరుకాలేకపోయిన కేటీఆర్ ఎమ్మెల్యేగా కూడా ప్రమాణ స్వీకారం చేయలేదు. ఎంపీ, ఎమ్మెల్సీలుగా ఉంటూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన బీఆర్ఎస్ నేతలు కొందరు ప్రమాణం చేయలేదు. వారిలో మెదక్ ఎంపీగా కొనసాగుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు. వీరు ఇంకా తమ పదవులకు రాజీనామా చేయకపోవటంతో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయలేకపోయారు. మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ పద్మారావుగౌడ్ ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో లేకపోవటంతో ఆయన కూడా ప్రమాణం చేయలేదు.

### తెలంగాణతల్లికి.. అమరవీరులకు..

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఎల్పీ సమావేశం ప్రారంభానికి ముందు తెలంగాణ భవన్‌లోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లోని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. పార్టీ ఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం ప్రత్యేక బస్సులో బయలుదేరి అసెంబ్లీ ముందు గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆ తరువాత వారు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమానికి హాజరయ్యారు. సుదీర్ఘ పోరాటం తరువాత కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పిన డిసెంబర్ 9వ తేదీ తమకు అత్యంత పవిత్రమైన రోజు అని, తాము అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ ఆకాంక్షల పరిరక్షణే తమకు ముఖ్యమని ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జై తెలంగాణ నినాదాలు వెళ్లారు.

## లోకం పోకడ




## మరోరోజు ప్రమాణ స్వీకారం చేస్తా

- కేసీఆర్ సర్జరీ నేపథ్యంలో హాజరుకాలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎడమకాలి తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోయానని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయనున్నట్టు తెలిపారు. దవాఖానలో కేసీఆర్ వద్ద ఉన్న నేపథ్యంలో శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసనసభా పక్ష సమావేశానికి సైతం తాను హాజరుకాని విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 14.2°c | 33.7°c |
| మెదక్ | 14.5°c | 32.2°c |
| ఆదిలాబాద్ | 16.2°c | 32.5°c |
| నిజామాబాద్ | 17.5°c | 28.1°c |
| హైదరాబాద్ | 17.7°c | 30.6°c |
| కరీంనగర్ | 18.0°c | 28.0°c |
| వరంగల్ | 18.0°c | 30.0°c |
| ఖమ్మం | 18.0°c | 31.0°c |
| నల్లగొండ | 19.0°c | 34.8°c |
| మహబూబ్‌నగర్ | 21.1°c | 31.2°c |



కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కూకట్‌పల్లి రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## కేసీఆర్ కోలుకోవాలని ఆలయాల్లో పూజలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం కూకట్‌పల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన మహనీయుడని.. పదేండ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని మాధవరం కొనియాడారు. కేసీఆర్ ఆరోగ్యం త్వరగా బాగుపడాలని దేవుడిని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ తులసీరావుతదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలంలో భారత జాగృతి హోమం

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకొని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుతూ భారత జాగృతి ఆధ్వర్యంలో భద్రాద్రి పుణ్యక్షేత్రంలో చేపట్టిన హోమం శనివారంతో ముగిసింది. శ్రీరాముడి సన్నిధిలో రెండు రోజులపాటు హోమాది ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కోలుకుంటున్న కేసీఆర్

- వాకర్ సాయంతో నడిపించిన వైద్యులు
- 2, 3 రోజుల్లో డిశ్చార్జ్ చేసే అవకాశం
- 6-8 వారాల విశ్రాంతి అవసరం: డాక్టర్లు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స అనంతరం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కోలుకుంటున్నారు. శుక్రవారం ఆయన ఆరోగ్య పరిస్థితి కాస్త మెరుగుపడింది. వైద్యులు వాకర్ సాయంతో ఆయనను నడిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నదని చెప్పారు. చాలా వేగంగానే రికవరీ అవుతున్నారని అన్నారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ వైద్యుల పర్యవేక్షనలో వాకర్ సాయంతో నడిపించే ప్రయత్నం చేయగా, ఆయన శరీరం బాగా స్పందించిందని తెలిపారు. బెడ్ బయటకు వచ్చి కూర్చున్నారని వెల్లడించారు. సాధారణంగా తుంటి కీలు మార్పిడి జరిగిన పేషెంట్‌ను 12 గంటల్లోపు నడిపించే ప్రయత్నం చేస్తామని, దీన్ని మెడికల్ పరిభాషలో 'మొబిలైజేషన్ స్టార్ట్' అంటారని వివరించారు. కేసీఆర్‌కు ఆపరేషన్ నొప్పి తగ్గి, సాధారణ నొప్పి మాత్రమే ఉన్నదని, ఆయన శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నారని తెలిపారు. సాధారణ ఆహారమే తీసుకుంటున్నారని పేర్కొన్నారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు కూడా చేయిస్తున్నామని చెప్పారు. మరి కొన్ని రోజులు ఫిజియోథెరపీ కొనసాగించాల్సి ఉంటుందని అన్నారు. శరీరం సహకరిస్తే మరో రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని తెలిపారు. కనీసం 6-8 వారాలపాటు విశ్రాంతి అవసరం ఉంటుందని వివరించారు.

### అసదుద్దీన్, అఖిలేశ్‌యాదవ్ పరామర్శ

ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ యశోద హాస్పిటల్‌లో మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ సంతోష్‌కుమార్‌ను కలిసి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడాలని, వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, వేగంగా కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉన్నది. అల్లా దయతో ఆయన త్వరలోనే మళ్లీ రంగంలోకి దిగుతారని ఆశిస్తున్నాను' అని అసదుద్దీన్ ట్వీట్ చేశారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్ ఆరా తీశారు. కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌ను ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామి కూడా పరామర్శించారు. ఆయన వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### రెట్టించిన ఉత్సాహంతో ప్రజాసేవకు: రామోజీరావు

ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీరావు ప్రత్యేకంగా కేటీఆర్‌కు లేఖ రాశారు. 'నాన్నగారు ప్రమాదవశాత్తూ జారిపడి క్షతగాత్రులయ్యారని తెలిసి నాకు కలిగిన బాధను మీతో పంచుకోకుండా ఉండలేకపోయాను. తుంటి మార్పిడి కోసం ఆయనకు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందన్న వార్త ముదావహం. తన వ్యక్తిగత, రాజకీయ జీవితాల్లో ఎదురైన ఎన్నో ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొని సాఫల్యం పొందిన కేసీఆర్.. ఈ సవాలును అవలీలగా అధిగమిస్తారని, కొన్ని వారాల విశ్రాంతి అనివార్యమైనా అనతికాలంలోనే కోలుకొని ప్రజాసేవకు రెట్టించిన ఉత్సాహంతో పునరంకితమవుతారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను' అని లేఖలో పేర్కొన్నారు.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### మిలిటరీలో నర్సింగ్ పోస్టులు

త్రివిధ దళాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి మిలిటరీ నర్సింగ్ సర్వీస్ నోటిఫికేషన్ విడుదలైంది.

- మిలిటరీ నర్సింగ్ సర్వీస్ (ఎస్ఎస్‌సీ) 2023-24
- ఈ పోస్టులు ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీలో ఉన్నాయి.
- అర్హతలు: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ (నర్సింగ్), పోస్ట్ బేసిక్ బీఎస్సీ (నర్సింగ్)/ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
- వయస్సు: 21-35 ఏండ్ల మధ్య ఉండాలి
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 26
- వెబ్‌సైట్: https://indianarmy.nic.in

### ఐఐటీలో..

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: ఆఫీసర్ (సివిల్), జనరల్ డ్యూటీ అసిస్టెంట్,
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 29
- వెబ్‌సైట్: https://www.iimidr.ac.in

### షిప్పింగ్ కార్పొరేషన్‌లో..

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 43
- పోస్టులు: మాస్టర్ మెరైనర్, చీఫ్ ఇంజినీర్
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 11
- వెబ్‌సైట్: https://www.shipindia.com

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకనామిక్స్, మ్యాథ్స్ (గ్రూప్స్) ఐఐటీ-నీట్ ఫిజిక్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.



బంజారాభవన్‌లో మాట్లాడుతున్న ఆలిండియా బంజారా సేవాసంఘ్ అధ్యక్షుడు రాంచంద్రనాయక్

## బంజారాలకు మంత్రివర్గంలో చోటు ఇవ్వాలి

- ఆలిండియా బంజారా సేవాసంఘ్ డిమాండ్

బంజారాహిల్స్, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలిలో బంజారాలకు స్థానం కల్పించాలని ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శనివారం బంజారాహిల్స్ రోడ్ నంబర్-10లో ఉన్న బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో సేవాసంఘ్ అధ్యక్షుడు ఇస్లావత్ రాంచంద్ర నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో 10 శాతం ఉన్న గిరిజనుల్లో లంబాడాలు సుమారు 7 శాతం ఉన్నారని, వారికి మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి కేతావత్ సోన్‌లాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుమన్ నాయక్, సుభాష్ నాయక్, రమావత్ విష్ణునాయక్, భూక్యా రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో మల్లారెడ్డి నవ్వుల్.. నవ్వుల్

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం సందర్భంగా అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకున్నది. మాస్ మలన్నగా పేరుగాంచిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తన వంతు రాగానే ప్రమాణ స్వీకార వేదికకు వస్తూ అందరికి నమస్కరించారు. అధికారపక్షంతో పాటు స్వపక్షంలోని సభ్యులందరికీ నవ్వుతూ చేతులు జోడించి నమస్కరించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సహా సభలోని మిగతా సభ్యులంతా నవ్వడం కనిపించింది. మల్లారెడ్డి సైతం తనదైన చిరునవ్వుతోనే ప్రమాణ స్వీకారాన్ని ముగించి, ప్రొటెం స్పీకర్‌కు నమస్కరించి తన స్థానంలో కూర్చున్నారు.



శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, సుధీర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు

## రైతుబంధు కోసం ఎదురు చూస్తున్నరు

మొదటిపేజీ తరువాయి...

రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తామని అన్నారు. ఇవాళ డిసెంబర్ 9వ తేదీ.. ప్రజలు, రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై అసెంబ్లీలో ఏదైనా ప్రకటన చేస్తారని అనుకున్నాం. కానీ ఎలాంటి ప్రకటన చేయలేదు' అని హరీశ్ పేర్కొన్నారు. యాసంగి పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. రైతుబంధు ఎప్పుడు వేస్తారో రైతాంగానికి స్పష్టతనివ్వాలని తాము కాంగ్రెస్ నాయకులను అడుగుతున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో యాసంగి పంటలు ప్రారంభమయ్యాయని, తాము ఏడెనిమిదేండ్ల పాటు నవంబర్ చివరి వారం నుంచి.. డిసెంబర్ మొదటి వారంలోపు రైతుబంధు వేశామని గుర్తు చేశారు.

### క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలి

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన మరో వాగ్దానాన్ని కూడా అమలు చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి క్వింటాల్‌కు గిట్టుబాటు ధరతో పాటు, రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు త్వరగా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు రోడ్లపై ధాన్యపు రాశులు ఆరబెడుతున్నారని, తుఫాన్ కారణంగా వర్షాలు పడుతుండటంతో ఆ ధాన్యం తడుస్తున్నదని చెప్పారు. ఈ దయనీయ పరిస్థితుల్లో రైతులంతా ప్రభుత్వం ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా? అని ఎదురుచూస్తున్నారని అన్నారు. 'మీరు వడ్లు అమ్ముకోవద్దు. మేము అధికారంలోకి రాగానే ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తాం, వడ్లు కొనుగోలు చేస్తాం' అని ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. 'మీరు ప్రకటించిన రూ.500 బోనస్ ఎప్పటి నుంచి ఇస్తారు? బోనస్‌తో కూడిన వడ్ల కొనుగోలు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు?' అని రైతుల పక్షాన ప్రశ్నిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వ పెద్దలే వారికి స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఇప్పుడే విమర్శలు చేయడం లేదని, ప్రజల పక్షాన, రైతుల పక్షాన స్పష్టత కోసం అడుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు ఉన్నారు.

## బీసీ బిల్లు కోసం 13, 14 తేదీల్లో ఢిల్లీలో ఆందోళన

- రాష్ట్రంలో 26 బీసీ కులాలను జాబితాలో చేర్చాలి: ఆర్ కృష్ణయ్య



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య. చిత్రంలో ఆళ్ల రామకృష్ణ తదితరులు

రవీంద్రభారతి, డిసెంబర్ 9: పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13, 14 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. తక్షణమే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తొలగించిన 26 బీసీ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తెలంగాణ యువత ఆకాంక్షలను అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాలని సూచించారు. అంతేకాకుండా 2 లక్షల ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, నీలా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.